# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 99 క్రిష్ణా, ఆదివారం 04 - 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఏపీలోని రైతులందరికీ కానుక.. కీలక ప్రకటన చేసిన చంద్రబాబు




క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , ఏపీలో జనవరి 2 తేదీ నుంచి రైతులకు కొత్త పట్టదారు పాపు పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ నెల 9వ తేదీ వరకు వీటిని రాష్ట్రంలోని రైతులందరికీ అందించనుంది. ఆలోపు పూర్తి చేయాల్సిందిగా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు కూడా వెళ్లాయి. ప్రభుత్వ రాజముద్రతో కూడిన ఈ కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను రైతులందరికీ ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. జనవరి 2వ తేదీన రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వీటిని తీసుకోవాలంటే రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. సిబ్బంది నేరుగా ఇంటింటికి తిరిగి రైతులకు అందిస్తున్నారుప్రభుత్వ రాజముద్రతో..

ఈ కార్యక్రమంపై శుక్రవారం సచివాయలంలో సీఎం చంద్రబాబు సమీ సమావేశం నిర్వహించారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ఎలా జరుగుతుందనే దానిపై మంత్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అనేవి రైతులకు ఇస్తున్న న్యూ ఇయర్ కానుక అని అన్నారు. ఎన్నికల సమయంలో కొత్త పాసు పుస్తకాలు ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఆ హామీని ఇప్పుడు నెరవేర్చుకున్నట్లు తెలిపారు. రీ సర్వేలో తప్పులు సరిదిద్దిన తర్వాత కొత్త పాసు పుస్తకాలు అందించినట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సీఎం ఫొటోను ముద్రించి ఇచ్చిందని, తాము ప్రభుత్వ రాజముద్రతో మాత్రమే కొత్త వాటిని ఇచ్చినట్లు చెప్పారు.

22 లక్షలు పుస్తకాలు పంపిణీ

రీ సర్వే పూర్తైన గ్రామాల్లోని రైతులకు కూడా కొత్త పాసు పుస్తకాలు అందిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 22 లక్షల పాసు పుస్తకాలను రీ సర్వే పూర్తైన గ్రామాల్లో రైతులకు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ రాజముద్రతో ఉన్న కొత్త పాసు పుస్తకాలను చూసి రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

## ఈసారి ప్రత్యేకంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు.. ఈవో కీలక ఆదేశాలు

క్రైం కౌంటర్ న్యూస్ నంద్యాల, జనవరి 3 : శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ ఈవో శ్రీనివాసరావు ఇవాళ(శనివారం) దేవస్థానం అధికారులతో సమీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సుమారు 30 శాతం మంది భక్తులు ఎక్కువగా శ్రీశైలం క్షేత్రానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంచనాలకు అనుగుణంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

పకడ్బందీగా క్యూలైన్లు.. ప్రధానంగా క్యూలైన్ల నిర్వాహణ, భక్తులకు తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య ఏర్పాట్లపై చర్చించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు భారీగా ఆలయానికి చేరుకుంటారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, క్యూలైన్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, వేచి ఉండే సమయంలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

అటవీ ప్రాంతం వెంట వచ్చేవారికి..

అలాగే, అటవీ ప్రాంతం వెంట నడకదారిలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈవో స్పష్టం చేశారు. నడకదారిలో లైటింగ్, వైద్య సహాయం, భద్రతా చర్యలు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం అదనంగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వాహనాల రద్దీని తగ్గించేందుకు ట్రాఫిక్




నియంత్రణ చర్యలు చేపట్టాలని, భక్తులకు స్పష్టమైన సూచనలు, మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు ఈవో శ్రీనివాసరావు. అదనపు సిబ్బందిని నియమించుకోవాలి..బ్రహ్మోత్సవాల ఏర్పాట్లన్నీ ఈ నెల చివరి నాటికి పూర్తిచేయాలని ఈవో శ్రీనివాసరావు ఆదేశించారు. ప్రతి విభాగం తమకు కేటాయించిన పనులను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, సురక్షితంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు.

## కాంగ్రెస్ మా సహజ మిత్రుడు.. విజయ్ టీవీకే సంకేతాలు



క్రైం కౌంటర్ న్యూస్ చెన్నై: ఈ ఏడాది జరుగునున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపే అవకాశాలున్నాయని నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం సంకేతాలు ఇచ్చింది. టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ, లౌకికవాదం, మతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటం విషయంలో కాంగ్రెస్–టీవీకే విధానాలు ఒకేలా ఉంటాయని, ఆ పరంగా రెండు పార్టీలు సహజ భాగస్వాములని చెప్పారు. రాహుల్ గాంధీ, తమ నేత విజయ్ మంచి స్నేహితులని తెలిపారు. ఇరు పార్టీల మధ్య పొత్తుకు అవకాశాలున్నప్పటికీ ఒక అవగాహనకు వచ్చేముందు కొన్ని అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని ఫెలిక్స్ అన్నారు. ప్రస్తుత ప్రతిష్టంభనకు తమిళనాడు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. ఆ పార్టీ విభాగం నేతలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీవీకేతో చర్చలకు వెనుకంజ వేస్తున్నట్టు కనిపిస్తోందని అన్నారు. టీవీకే, కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటే మైనారిటీ, బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా కాపోడుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కాగా, టీవీకే–కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవచ్చనే సంకేతాలు గత నెలలోనే కనిపించినట్టు చెబుతున్నారు. డిసెంబర్ 25న జరిగిన టీవీకే కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనడం ఈ వాదనకు బలం చేకూర్చింది. తమిళనాడులో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా 2024 అక్టోబర్‌లో టీవీకేను విజయ్ ప్రారంభించారు. అయితే టీవీకే ఎంట్రీతో తమకొచ్చే ముప్పు ఏదీ లేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ధీమా వ్యక్తం చేస్తోంది.

## సావిత్రిబాయి పూలే 195వ జయంతి: పామూరులో బీజేపీ నేతల నివాళి

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , పామూరులో, శ్రీమతి సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను మండల బిజెపి నేతలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సమాజంలో అట్టడుగు వర్గాల జీవితాల్లో సంస్కరణలు తీసుకువచ్చిన తొలి వ్యక్తి సావిత్రిబాయి పూలే అని, విద్య కుల, లింగ వివక్ష నుండి విముక్తి పొందే ఆయుధం అని ఆమెను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.




## పవన్ కల్యాణ్ కొండగట్టు పర్యటనపై స్పందించిన దాసోజు శ్రవణ్





క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , 2009లో హుస్నాబాద్ ఎన్నికల ప్రచార సమయంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రాణాలతో బయటపడటం కేవలం అదృష్టం కాదని, సాత్తు కొండగట్టు అంజన్న చూపిన ఒక అద్భుతమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. పవన్ కల్యాణ్ కొండగట్టు పర్యటనపై ఆయన ౬ఎక్స్౯ వేదికగా స్పందించారు.పునర్జన్మనిచ్చిన కొండగట్టు అంజన్నకు భక్తితో కూడిన కృతజ్ఞత తెలిపారంటూ పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి అన్నారు. ఆ రోజు తాను ప్రాణాలతో బయటపడటం వెనుక కొండగట్టు అంజన్న ఆశీస్సులు ఉన్నాయనే గట్టి నమ్మకంతో, అచంచలమైన భక్తి విశ్వాసాలతో తనకి పునర్జన్మనిచ్చిన ఆ క్షేత్రంపై కృతజ్ఞతతో, ఆలయ అభివృద్ధి కోసం రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో దీ విరమణ మండపం మరియు సత్రం నిర్మాణానికి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు.ఇందుకు తెలంగాణ ప్రజల పన పవన్ కల్యాణ్‌కు దాసోజు శ్రవణ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆధ్యాత్మికతను, సామాజిక బాధ్యతను చాటుతూ ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అంజన్న ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుకు చొరవ చూపి సహకరించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కూడ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పెల్లుబికిన అభిమానం




క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , ఇటు నేతలు, అటు పార్టీశ్రేణుల్లో డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిపై ఉన్న నమ్మకం స్పష్టమైంది. అందుకు శనివారం సాయంత్రం ఆయన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగిన తీరు అద్దం పట్టింది. పార్టీ కార్యకర్తలు, శ్రేణులతో ప్రాంగణం కిట కిటలాడగా ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి తరలివ చ్చిన టీడీపీ నాయకులతో వేదిక కూడా కళకళలాడింది. టీడీపీ ఒంగోలు లోక్‌సభ అధ్యక్షుడిగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఒంగోలు సౌత్ బైపాస్ రోడ్డులోని ఒక కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చూసి తెలుగుదేశం అభిమానులు పులకించిపోయారు. ఒంగోలు లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడిగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితోపాటు 44మందితో కార్యవర్గాన్ని అధిష్ఠానం ఏర్పాటుచేసిన విషయం విదితమే. అన్ని ప్రాంతాలకు, అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ఎక్కువ శాతం నిబద్ధతతో పనిచేసే వారికి అవకాశం కల్పించారు. డాక్టర్ ఉగ్ర బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని ఒకరోజు ముందే ఖరారు చేశారు. అయినా వేలాదిమంది పార్టీశ్రేణులు తరలివచ్చారు. ఎవరికి వారు సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకుని రావడం మరో విశేషం. ప్రస్తుతం ఒంగోలు లోక్‌సభ ఇటు ప్రకాశం, అటు మార్కాపురం జిల్లాల పరిధిలో విడిపోయింది. ఉగ్ర ప్రాతినిధ్యం వహించే కనిగిరి మార్కాపురం జిల్లాలో ఉంది. లోక్‌సభ అధ్యక్షునిగా ఆయన బాధ్యతల స్వీకరణకు రెండు జిల్లాల ప్రతినిధులు తరలివచ్చారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనంతోపాటు మంత్రి స్వామి హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇద్దరు ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవిలో ఉన్నవారు తరలివచ్చారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక వల్లూరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన డాక్టర్ ఉగ్ర అక్కడ ఇద్దరు మంత్రులకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా వేదిక వద్దకు వచ్చారు.

# వికసిత్ గ్రామాలే..లక్ష్యంగా..!



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం స్థానంలో వికసిత భారత్– 2047 దార్శనికతకు అనుగుణంగా వికసిత్ భారత్ – రోజ్ గార్ అజీవికా మిషన్ (గ్రామీణ) (వీబీ జీ రామ్ జీ ) చట్టం –2025ను కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ అందు బాటులోకి తీసుకొచ్చింది. కొత్త చట్టంలోని ముఖ్య అంశాలు, చట్టపర హక్కుల గురించి అవగాహన కల్పిం చడానికి రాష్ట్రంలోని అన్ని పంచాయతీ ల్లో ఈనెల 5వ తేదీన రాష్ట్రమంతటా ఒకేసారి గ్రామ సభలు నిర్వహించాలని నిర్ణయించారు.జిల్లా లోని 547 పంచాయతీల్లో ఈ గ్రామ సభలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నా రు. ఈ చట్టాన్ని ఉపాధి శ్రామికుల ఉపాధి కోసం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలకు ప్రాధాన్యతతో పాటు, సామాజిక, ఆర్థిక సాధికా రితను మరింత బలోపేతం చేయడయే లక్ష్యం గా పెట్టుకుని ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.ఈ చట్టంపై అవగాహన కోసం కరపత్రాలు, పోస్టర్లు, హోర్డింగులు తయారు చేసుకుని ప్రతి గ్రామ సభ వేదిక వద్ద ఉంచాలి. ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామసభ జరిగే ప్రదే శాల్లో పోస్టర్లు ప్రదర్శించాలి. గ్రామ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర గ్రామీ ణాభివృద్ధి శాఖ కమిషనర్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

చట్టంలోని ప్రధాన అంశాలు

ఉపాధి కూలీలకు 125 రోజులు ఉపాధి హామీ. గ్రామ సభల ద్వారా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (విజిపిపి) రూపొందిస్తా రు. శక్తివంతమైన నిరుద్యోగ భృతి ఏర్పాటు ఈ చట్టం ద్వారా కలుగుతుంది. వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలో అన్ని పథకాలు అను సంధానం చేస్తారు. నిర్ణీత సమయాల్లో చెల్లిం పులు, ఆలస్యానికి పరిహారం వసూలు చేస్తారు. సాంకేతిక పరిజ్ఞానంతో శక్తివంతంగా ఈ చట్టాన్ని అమలు చేయనున్నారు. మెరుగైన హామీ, ధృఢమైన నిబద్దత, సమర్థపాలన వంటి అంశాలే వికసిత్ భారత్‌గా పేర్కొన్నారు.

గ్రామ సభలకు ఏర్పాట్లు

జిల్లాలోని 547 గ్రామ పంచాయతీల్లో ఈనెల 5వ తేదీన వీబీ– జీ రామ్‌జీ చట్టంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక గ్రామ సభల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం స్థానే వీబీ జీ రామ్‌జీ చట్టం వచ్చింది. ఇందులో పేర్కొన్న మార్గదర్శకాలను ప్రజలకు సమగ్రంగా వివరిస్తాం. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, ఇతర అంశాలపై ఈ గ్రామ సభల్లో చర్చించి వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికను రూపొందిస్తాం.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్..



క్రైం కౌంటర్ న్యూస్, నిడదవోలు, జనవరి 3 : తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా బంగారం, వెండి నగదు దోచేస్తున్న అంతర్ జిల్లాల దొంగ ను అరెస్టు చేసి భారీగా బంగారం, వెండి నగదు స్వాధీనం చేసుకున్నా మని నిడదవోలు సీఐ పీవీజీ.తిలక్ తెలిపారు. శనివారం తూర్పుగోదా వరి జిల్లా నిడదవోలు పోలీసు స ర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. డిసెంబర్ 10న నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరంలో కరుటూరి వెంకటరత్నం ఇంట్లో దొంగతనం జరిగింది. 223 గ్రాము ల బంగారం, 250 గ్రాముల వెండి, సుమారు రూ.3లక్షల 50వేల నగదు చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును చేధించారు. పోలవరం జిల్లా అడ్డతీగల మండలం గొంటివారిపాలెనికి చెందిన చిలపనశెట్టి సన్యాసిరావు అలియాస్ సతీష్ అలియాస్ చిన్ని అనే పాత నిందితుడు దొంగత నానికి పాల్పడినట్టు గుర్తించారు. చిన్నిని శుక్రవారం సాయంత్రం రాజమహేం ద్రవరం మోరంపూడి జంక్షన్ లో అరెస్టు చేశారు. దొంగతనం చేసిన 223 గ్రాముల బం గారం, 250 గ్రాముల వెండి ప్లేటు, సుమారు రూ.లక్ష నగదు రికవరీ చేశారు. నింది తుడి నుంచి మొత్తం రూ.19. 34 లక్షల విలువైన బంగారం, వెండి నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలి పారు. గోకవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన హీరో ఫ్యాషన్ మోటార్ సైకి ల్‌ను కూడా స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు. నిందితు డిపై ఇప్పటికే పలు జిల్లాల్లో కేసులు నమోదై జైలుకు కూడా వెళ్లి వచ్చాడ న్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ పై రెక్కీ చేసి పగలు లేదా రాత్రిళ్లు దొంగతనం చేసి విలువైన వస్తువులను దోచుకుపోతుం టాడని తెలిపారు. దొంగతనం జరిగిన అతి తక్కువ సమయంలోనే నిందితుడిని పట్టుకుని వస్తువు లు రికవరీ చేయడంతో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. సమావేశంలో ఉండ్రాజవరం ఎస్ఐ డి.రవికుమార్, కానిస్టేబు ళ్లు బుజ్జి, జ్యోతి బాబు, కృష్ణారావు, సాంబయ్య, రహీం, రామాంజనేయులు పాల్గొన్నారు.

# సెల్ టవర్లు సిగ్నళ్లనే కాదు.. సెక్యూరిటీని ఇస్తాయ్....

## అల్లూరి జిల్లాలోని పోలీసులు, ఇంటెలిజెన్స్ అధికారులు వినూత్న ఆలోచన

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , వాడుకునే ఆలోచన ఉండాలే కానీ.. ఈ లోకంలో ప్రతీ వస్తువు ఉపయోగకరమైనదే. వివిధ రకాలుగా వినియోగించదగినదే. ఉదాహరణకు సెల్ టవర్లనే తీసుకోండి. సాధారణంగా సెల్‌టవర్లు ఎందుకు ఉపయోగపడతాయని అనుకుంటారు.. మారుమూల ప్రాంతాల వారికి కూడా సెల్ ఫోన్ సిగ్నల్స్ అందించేందుకు ఉపయోగపడతాయని అందరికీ తెలిసిందే. అందుకే ఏజెన్సీ ప్రాంతాలకు కూడా సెల్ సంకేతాలు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ టెలికాం సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే సెల్ టవర్లు.. ఫోన్ సిగ్నళ్లను మాత్రమే కాకుండా సెక్యూరిటీని (భద్రత) కూడా అందిస్తాయని తెలుసా.. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు ఈ రకమైన వినూత్న ఆలోచన చేశారు. అల్లూరి జిల్లాలోని మన్యం ప్రాంతం.. చాలా సున్నితమైన ప్రాంతం. శాంతి భద్రతల పరంగానూ పోలీసులకు అత్యంత కీలకమైన ప్రాంతం. దీంతో ఈ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు, నిఘా విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతూ ఉంటారు. ఈ క్రమంలోనే అనేక ఆధునిక యంత్ర పరికరాలను సైతంఈ ప్రాంతంలో వినియోగిస్తున్నారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతాలను ప్రధానంగా ఇబ్బంది పెట్టే సమస్య మావోయిస్టుల కదలికలు, గంజాయి సాగు, అక్రమ రవాణా. వీటిని అడ్డుకునేందుకు పోలీసులు మన్యం ప్రాంతంలో డ్రోన్ కెమెరాలు ఉ పయోగిస్తున్నారు. వీటికి అదనంగా మరో ముఖ్యమైన ఆలోచన కూడా చేశారు. సాధారణంగా సీసీ కెమెరాలను ట్రాఫిక్ నియంత్రణకు వాడుతుంటారు. ఇందులో



భాగంగా రద్దీగా ఉండే కూడళ్లు, జంక్షన్ల వద్ద వీటిని ఏర్పాటు చేస్తుంటారు. అయితే అల్లూరి జిల్లా పోలీసులు మాత్రం వినూత్నంగా ఆలోచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. అల్లూరి జిల్లాలో1,560 సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ అధికారులు ఈ సెల్ టవర్లను కూడా ఉపయోగించుకుంటున్నారు. ఈ సెల్ టవర్లను సీసీ కెమెరాలను అమర్చడం ద్వారా ఆయా గ్రామాలలో కదలికలపై పర్యవేక్షణ ఉంచుతున్నారు. దీంతో ఈ గ్రామాలకు సెల్ టవర్లను సెల్ ఫోన్ సిగ్నళ్లను అందించడం మాత్రమే కాకుండా సెక్యూరిటీగా కూడా ఉ ంటున్నాయి.

# ఏపీలో కొత్తగా స్పోర్ట్స్ అకాడమీ.., భూమిపూజ పూర్తి



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రతి జిల్లాలోనూ స్టేడియం నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆధ్యాత్మ నగరం తిరుపతిలో క్రీడారంగం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తిరుపతిలో అత్యాధునిక స్పోర్ట్స్ అకాడమీ నిర్మిస్తోంది. శాప్ ఛైర్మన్ రవి నాయుడు తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో ఈ స్పోర్ట్స్ అకాడమీని నిర్మిస్తున్నారు. రూ.5 కోట్ల వ్యయంతో తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమీని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడిన శాప్ ఛైర్మన్ రవి నాయుడు.. తిరుపతిలో జాతీయ స్థాయి ప్రమాణాలతో స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పటియాలా తర్వాత తిరుపతిలోని స్పోర్ట్స్ అకాడమీ సమగ్ర శిక్షణ కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. 200 మంది క్రీడాకారులకు వసతి కల్పించేలా వసతి గృహం, జాతీయ ప్రమాణాలతో వెయిట్ లిఫ్టింగ్ హాల్, కాన్ఫరెన్స్ హాల్, బ్యాడ్మింటన్, జూడో, లాన్ టెన్నిస్, చెస్ వంటి ఆటల కోసం ఇండోర్, అవుట్ డోర్ సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. జూన్ నాటికి ఈ అకాడమీని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మరోవైపు క్రీడారంగం అభివృద్ధికి, యువ క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు ఏపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేసే మల్టీ స్పోర్ట్స్ ట్రైనింగ్ అకాడమీ.. ఆధునిక వసతులతో, ప్రొఫెషనల్ కోచింగ్‌తో సమగ్ర శిక్షణ అందిస్తుందని రవి నాయుడు వివరించారు. రాష్ట్రం నుంచి భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేసేందుకుఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న ఈ అకాడమీ జూన్ నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు. మరోవైపు తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. దామినేడులో భూమిని కూడా కేటాయించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో 28.37 ఎకరాల భూమిని శాప్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మొత్తంగా ఆధ్యాత్మిక నగరం తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

### ఉల్లి రైతులకు రూ.128.33 కోట్ల మెగా చెక్కు పంపిణీ

క్రైం కౌంటర్ న్యూస్, కోడుమూరు, జనవరి 3 : అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్థక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోడుమూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉల్లి రైతులకు పరిహారం పంపిణీ సభ స్థానిక ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధ్యక్షతన జరిగింది. కర్నూలు, కడప జిల్లాలో ఉల్లి సాగు చేసిన ఆర్థికంగా నష్టపోయిన 37,752 మంది రైతులకు హెక్టారుకు రూ.50 వేలు చొప్పున రూ.128.33 కోట్ల మెగా చెక్‌ను రైతులకు అందజేశారు. కర్నూలు జిల్లాలో 31,352 మంది రైతులకు రూ.99.91 కోట్లు అందించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ఉల్లి రైతులు తీవ్రంగా పట్టనష్టం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని అన్నారు. ధరలు పతనం కావడంతో క్వింటాకు మద్దతు ధర రూ.1,200 నిర్ణయించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశాం. సీఎం చంద్రబాబు ఉల్లి రైతులను ఆదుకోవాలని హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించారని తెలిపారు. రా(ష్టాభివృద్ధికి సాగునీటి పారుదల, వ్యవసాయం ఎంతో కీలకం. రాష్ట్ర విభజన తరువాత నాటి టీడీపీ ప్రభుత్వంలో ఈ రెండు రంగాలు స్వర్ణయుగంగా ముందుకు సాగాయి. దేశ చరిత్రలో ఎన్నడు లేని విధంగా ప్రాజెక్టులకు రూ.50 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం సర్వనాశం చేశారని తెలిపారు. ఇరిగేషన్‌కు ఒక్కపైసా ఇవ్వకుండా ప్రాజెక్టులు నిర్వర్యం చేశారని ఆరోపించారు. ఉభయ గోదావరి జిల్లాలో కోకో పంట ధర పడితే ప్రభుత్వమే కిలో రూ.50లకు కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి లాగా ఉత్తుత్తి బటన్ నొక్కలేమని, కూటమి ప్రభుత్వం బటన్ నొక్కితే అర నిమిషంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అన్నారు. జగన్ దౌర్జన్యాలు, రౌడీయిజం, అక్రమ వసుళ్ల కారణంగా రాష్ట్ర సర్వనాశం చేశారని ఘాటుగా విమర్శించారు.

పెట్టుబడుల్లో అగ్రస్థానం ఏపీ

ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని, రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వల్లే అది సాధ్యమయిందని పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. రైతులకు ఏ కష్టమొచ్చినా తామున్నామం టూ సీఎం చంద్రబాబు ఆర్థిక భరోసా అందస్తారని అన్నారు. కర్నూలు మార్కెట్‌లో ఉ



ల్లి ధర పడిపోయిం దని తెలియగానే ముఖ్యమంత్రి తక్షణమే మద్దతు ధర రూ.1,200లకు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడమే కాకుండా బోనస్‌గా హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించారు. జిల్లాలో దాదాపు రూ.వంద కోట్లు రైతులకు అందజేసిన ప్రభుత్వం మనదే అన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రైతులకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వం ముందు ఉంటుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి ఉల్తి విత్తనాలు దిగుమతి చేసుకొని అధిక దిగుబడులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కోడుమూరు నియోజకవర్గంలో 8,890 మంది ఉల్లి రైతులకు రూ.27 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. ఉల్లి నిల్వలకు ఏసీ గోదాములు నిర్మించాలని, కోడుమూరు పట్టణ తాగునీటి సమస్య తీర్చాలని మంత్రులను కోరారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌తో రైతుకు రుణ విముక్తి

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు, చక్రవడ్డీ భారాన్ని తగ్గించేందుకు వన్‌టైమ్ సెటిల్మెంట్ అమలు ప్రభుత్వం ప్రతిపాదించిందని గుర్తుచేశారు. పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సిరి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సునీత తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి వివిధ కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# గంజాయిని నిర్మూలిద్దాం-హోంమంత్రి అనిత



క్రైం కౌంటర్ న్యూస్ ఇచ్ఛాపురం, జనవరి 3: 'గంజా యి మత్తులో పడి భవిష్యత్‌ను నాశనం చేసుకో వద్దు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల'ని హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. శనివారం ఇచ్ఛాపురంలో నిర్వ హించిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర'లో ఆమె పాల్గొన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఐజీ గోపీనాథ్ జట్టి, విప్ బెందాళం అశోక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలి సి ఉత్సాహంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' ర్యాలీ చేపట్టారు. హోంమంత్రి అనిత స్కూటీపై, మిగిలిన వారంతా సైకిళు తొక్కుతూ ముందుకు కదిలారు. అనంత రం సురంగిరాజా మైదానంలో నిర్వహించిన సభ లో హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. 'గంజాయి రహిత రాష్ట్రమే సీఎం చంద్రబాబు లక్ష్యం. అం దులో భాగంగానే పాయకరావు పేట నుంచి ఇచ్ఛా పురం వరకు అభ్యుదయం సైకిల్‌యాత్ర చేప ట్టాం. డ్రగ్స్ వద్దురా బ్రో అనే నినాదంతో అభ్యుద యం సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టిన ఐజీ గోపీనాథ్ జట్టికి ప్రత్యేక ధన్యవాదాలు. గంజాయి నిర్మూలనకు ఈగల్ క్లబ్ ఐజీ రవికృష్ణ అవగా హన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. ఈ యాత్ర ఇచ్ఛాపురంలో ముగియడం ఎంతో ఆనందంగా ఉంది. నేనూ ఇచ్ఛాపురం ఆడబిడ్డనే. డ్రగ్స్ నిర్మూలనకు ఇచ్ఛాపురం నాంది పలకాలి. ఒడిశా నుంచి గంజాయి మొక్క కాదు కదా.. ఆకు తీసుకురావాలన్నా భయపడేలా చేయాలి. ఆంధ్రా – ఒడిశా బోర్డర్‌లో చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత పెంచాలి. గంజాయి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాల'ని స్పష్టం చేశారు.

గంజాయిపై ఉక్కుపాదం: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

గత వైసీపీ ప్రభుత్వం రా(ష్ట్రాన్ని గంజాయికి కేపిటల్‌గా మార్చేసిందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గంజాయిపై ఉక్కుపాదం మోపిందని తెలిపారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే సంకల్పం అందరిలో ఉండాలన్నారు. 'గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం మత్తు మందు వ్యాపారాలకు నిలయంగా మారింది. దీనివల్ల యువత చాలా నష్టపోయింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు చేపడుతోంది. వాటి మూలాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుంది. మొదటి సారిగా గిరిజన ప్రాంతాల్లో, మానవులు, వాహనాలు వెళ్లలేని ప్రాంతాల్లో సైతం డ్రోన్ కెమెరాల సహాయంతో గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేస్తున్నాం. అక్కడ గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అవగాహన కల్పిస్తున్నాం. రాష్ట్రంలో 18నెలల్లో 53వేల కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతీ ఒక్క యువకుడు ధైర్యంతో.. ఆరోగ్యంగా.. ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలి' అని రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు డ్రగ్స్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అభ్యుదయ సైకిల్ యాత్రికులకు శాలువలతో సత్కరించారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చుదిద్దుతాం: ప్రభుత్వ విప్ అశోక్

డ్రగ్స్ రహితంగా రా(ష్ట్రాన్ని తీర్చుదిద్దుతామని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డ్రగ్స్ వినియోగం ఎక్కువయ్యిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తుందని తెలిపారు. ఈగల్ వ్యవస్థ 53వేల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుందన్నారు. గంజాయిపై 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు, ఐజీ గోపినాథ్ జట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఈగల్ ఐజీ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్క ృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సీఎం చంద్రబాబు, హోంశాఖ మంత్రి అనిత, అభ్యుదయ సైకిల్‌యాత్ర సైకత శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# 53 రోజులు నిర్విరామంగా సాగిన 'సైకిల్ యాత్ర'

**పాయకరావుపేటలో ప్రారంభం.. ఇచ్ఛాపురంలో ముగింపు**

**నాలుగు జిల్లాల మీదుగా 1300 కిలోమీటర్ల ప్రయాణం**

**డ్రగ్స్‌తో అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు**


క్రైం కౌంటర్ న్యూస్ ఇచ్ఛాపురం, జనవరి 3: సమాజంలో గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల నియంత్రణకుగాను పోలీస్ శాఖ సామాజిక బాధ్యతగా 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో నిర్వహించిన అభ్యుదయ సైకిల్‌యాత్ర దిగ్విజ యంగా ముగిసింది. నాలుగు జిల్లాల పరిధిలో 53 రోజులపాటు నిర్విరామంగా 1300 కిలోమీటర్ల మేర యాత్ర సాగింది. గతేడాది నవంబరు 13న అనకాపల్లి జిల్లా పాయకరావు పేటలో ప్రారంభమైన యాత్ర.. శనివారం ఇచ్ఛాపురంలో దిగ్విజయంగా ముగిసింది.

రాష్ట్రంలో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఒడిశాలో సాగుచేస్తున్న గంజాయి ఉత్తరాంధ్ర మీదుగా రవాణా సాగుతోంది. గంజాయి మత్తుకు బానిసై కొంతమంది విద్యార్థులు, యువత భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం వాటిని నియంత్రించేందుకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అని పిలుపునివ్వడంతో అధికారులు ఎక్కడికక్కడే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. విశాఖ రేంజ్‌లో గంజాయి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 25 మంది కానిస్టేబుళ్లతో గతేడాది నవంబరు 13న అభ్యుదయ సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీతోపాటు ఐదు జిల్లాల ఎస్పీల పర్యవేక్షణలో సైకిల్‌యాత్ర విజయవంతంగా నిర్వహించారు. దారి పొడవునా గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల రవాణా, వినియోగంతో కలిగే దుష్పరిణామాలను



కళారూపాలతో అవగాహన కల్పించారు. జిల్లాలో గత ఏడాది డిసెంబరు 15న ఈ సైకిల్ యాత్ర ప్రవేశించింది. జిల్లాలో 30 మండలాలను కలుపుతూ సాగిన యాత్రకు జిల్లా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పోలీసులతో పాటు విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు యాత్రలో భాగస్వామ్యమయ్యారు. ముగింపులో భాగంగా ఇచ్ఛాపురంలో పైలాన్ ఆవిష్కరణ, భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో పోలీస్ శాఖ ఆనందం వ్యక్తం చేస్తోంది. అలాగే జిల్లాకు ఒకటి నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో గంజాయితోపాటు నిషేధిత మత్తుపదార్థాల రవాణా నియంత్రణలోకి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# భోగాపురానికి నేడే తొలి విమానం



క్రైం కౌంటర్ న్యూస్ విజయనగరం/ భోగాపురం: ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలవనున్న భోగాపురం (అల్లూరిసీతారామరాజు) అంతర్జాతీయ విమానాశ్రయానికి తొలి విమానం రానుంది. ట్రైల్ రన్‌లో భాగంగా ఆదివారం ఎయిర్ ఇండియా వాణిజ్య విమానం ఇక్కడ దిగనుంది. ఢిల్లీ నుంచి బయలుదేరి ఉదయం సుమారు 11 గంటలకు చేరుకోనుంది. ఈవిమానంలో కేంద్ర పౌరవిమాన యానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనా యుడు, ఉన్నతా ధికారులు ప్రయాణించనున్నారు. ట్రయల్‌రన్ అనంతరం మే నుంచి పూర్తి స్థాయి రాకపోకలు సాగించేలా ప్రభుత్వం భోగాపురం ఎయిర్‌పోర్టుపై దృష్టిసారించింది. ఉత్తరాంధ్ర వాసుల కలల ప్రాజెక్టుగా భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం రూపుదిద్దుకొంటోంది. భోగాపురం విమానాశ్రయం దక్షిణ భారతదేశంలోనే ప్రధాన ఆర్థిక కేంద్రంగా మారనుంది. 24 గంటల పాటు విమాన సర్వీసులు, అంతర్జాతీయ కనక్టివిటీ, వేలాది ఉద్యోగాలతో ఉత్తరాంధ్ర దశ మారబోతోంది. ఎయిర్‌పోర్టుకు మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును ఖరారు చేసిన విషయం తెలిసిందే. తుది మెరుగులు దిద్దుకుంటున్న విమానాశ్రయం ప్రస్తుతం వాయువేగంతో వాస్తవ రూపం దాల్చుతోంది. భూసేకరణ, న్యాయపరమైన చిక్కులన్నీ అధిగమించింది. 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భోగాపురం ఎయిర్‌పోర్టు పనుల పరిశీలనకు వచ్చినప్పుడు ప్రకటించినట్లు ఈ ఏడాది జూన్ నాటికల్లా పూర్తి చేయాలన్న సంకల్పంతో పనులను వేగవంతం చేశారు. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎప్పటికప్పుడు స్వయంగా పరిశీలిస్తూ పనుల్లో స్పీడు పెంచారు. కలెక్టర్ రామసుందర్ రెడ్డి కూడా ఎయిర్‌పోర్టు పనులను పర్యవేక్షిస్తూ అధికారులతో సమీక్షిస్తూ అడుగులు వేశారు. ముఖ గుర్తింపు ద్వారా పేపర్‌లేస్ ఎంట్రీ, 10కంటే ఎక్కువ ఆధునిక ఏరోబ్రిడ్జిల ద్వారా విమానాల ప్రవేశం, సోలర్ పవర్, వర్షపునీటి రీసైక్లింగ్ చేసే లీడ్ గోల్డెన్ రేటింగ్ నిర్మాణం సాగుతోంది. మొదటి దశలో ఏటా 60లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా టెర్మినల్ నిర్మాణం జరుగుతోంది. భవిషత్తులో దీనిని 1.8 కోట్ల వరకు పెంచే అవకాశం ఉంది. డిసెంబరు 2025 నాటికి 91.7శాతంపైగా పనులు పూర్తయ్యాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తొలి దశలో సుమారు రూ.4,592కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలో 136 ఎకరాల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేస్తున్నారు. ఇది విమానయాన రంగంలో వేలాది మంది యువతకు శిక్షణ, ఉపాధిని అందిస్తుంది. విశాఖ ప్రజలకు ఎయిర్‌పోర్టుకు వచ్చేందుకు ఇబ్బందులు లేకుండా మూడు ప్రధాన రహదారులను సిద్ధం చేస్తోంది. జాతీయ రహదారి 16 నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు అప్రోచ్‌రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. విశాఖ పోర్టు నుంచి భీమిలి మీదుగా భోగాపురం వరకు సముద్ర తీరం వెంబడి అత్యంత సుందరమైన బీచ్‌రోడ్‌ను బీచ్‌కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఫార్మా, మెరైన్, టెక్స్‌టైల్స్ ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు భారీ కార్గో టెర్మినల్ సిద్ధమవుతోంది. అలాగే విమానాల మరమ్మతుల కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ కారణంగా అంతర్జాతీయ విమానాలు కూడా ఇక్కడకు వస్తాయి.

# చతుర్ముఖ వ్యూహం

**బందరు పోర్టుతో తెలంగాణా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోల్‌కతాకు కనెక్టవిటీ**

**ఎంపీలు, ఎన్‌హెచ్ అధికారుల సమావేశంలో చర్చ**

**తెలంగాణా నుంచి రెండు మార్గాలకు అనుసంధానం**

**ఎన్‌హెచ్-65, 216హెచ్ విస్తరణకు ఎంపీల డిమాండ్**

**ఓఆర్ఆర్ మొదలైతే అమరావతి మీదుగా హైదరాబాద్‌కు..**



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , మచిలీపట్నం/విజయవాడ) : తెలంగాణా నుంచి బందరు పోర్టుకు వెళ్లడానికి ఎన్‌హెచ్-65 ఒక్కటే మార్గం. ప్రస్తుతం దీనిని ఆరు వరసలుగా విస్తరిస్తున్నారు. భవిష్యత్తులో అమరావతి ఐఆర్ఆర్, ఓఆర్ఆర్‌లు సాకారమయ్యే వరకు ఈ జాతీయ రహదారి మీదుగానే బందరు పోర్టుకు రాకపోకలు సాగించాలి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ మార్గంతో పాటు మరో మార్గాన్ని కూడా విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరి సూచించారు.

ఎన్‌హెచ్-216హెచ్‌తో అనుసంధానం ఇలా..

ముదినేపల్లి-నూజివీడు-కల్లూరు (ఎంఎన్‌కే) రోడ్డుగా పిలిచే ఎన్‌హెచ్-216హెచ్‌ను ఖమ్మంజిల్లా లక్ష్మీపురం వరకు అనుసంధానించాలని ఎంపీలు సూచించారు. గతంలో ఉన్న ప్రతిపాదన కాకుండా మచిలీపట్నం-గుడివాడ-విస్సన్నపేట-లక్ష్మీపురం వరకు మార్చి ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. హనుమాన్ జంక్షన్ వరకు విస్తరించాలన్న పాత ప్రతిపాదనపై ఎంపీ కేశినేని చిన్ని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని నూజివీడు మీదుగా విస్సన్నపేట, తిరువూరు, లక్ష్మీపురం వరకు తీసుకెళ్తే ఎన్‌హెచ్-30పై రద్దీని తగ్గించటానికి అవకాశం ఉంటుందని, ప్రస్తుతం రెండు వరసలుగా ఉన్న ఎన్‌హెచ్-216హెచ్‌ను నాలుగు వరసలుగా మచిలీపట్నం నుంచి లక్ష్మీపురం వరకు అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై జాతీయ రహదారుల సంస్థ అధికారులు సానుకూలంగా స్పందించారు.

తెలంగాణా-బందరు పోర్టు ద్విముఖ వ్యూహం

బందరు పోర్టుకు రెండువైపులా తెలంగాణా రాష్ట్రంతో అనుసంధానం ఏర్పడుతుంది. పోర్టు నుంచి ఎన్‌హెచ్-65 వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. మచిలీపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిగా ఈ ఎన్‌హెచ్-65 ఉంది. త్వరలో ఏర్పడబోయే అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)కు బందరు పోర్టు అనుసంధానం అవుతుంది. అప్పుడు బందరు పోర్టు వయా అమరావతి, హైదరాబాద్ అవుతుంది. కంచికచర్ల దిగువన ఎన్‌హెచ్-65కు అనుసంధానమవుతూ నేరుగా హైదరాబాద్ వెళ్తుంది. ఇదికాకుండా ఎన్‌హెచ్-216హెచ్ నాలుగు వరసల విస్తరణ ప్రతిపాదనతో ఖమ్మంజిల్లా నుంచి తిరువూరు, విస్సన్నపేట, నూజివీడు, హనుమాన్ జంక్షన్, గుడివాడ, మచిలీపట్నం వరకు వాయువ్య, ఉత్తర దిశలో అనుసంధానమవుతుంది. దీంతో బందరు పోర్టుకు రెండు వైపులా తెలంగాణా రాష్ట్రానికి మార్గం ఏర్పడుతుంది.

ఒడిశా, కోల్‌కతాతో కనెక్టవిటీ ఇలా..

బందరు పోర్టు తెలంగాణాకే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోల్‌కతాకు కూడా అనుసంధానం అవుతుంది. కత్తిపూడి-ఒంగోలు మార్గం అయిన ఎన్‌హెచ్-216 మచిలీపట్నం అవుటర్ నుంచి వెళ్తుంది. ఇది ఎన్‌హెచ్-65కు అనుసంధానం అవుతుంది. కత్తిపూడి దాటాక ఎన్‌హెచ్-216.. ఎన్‌హెచ్-16ను కలుస్తుంది. దీనిని బట్టి చూస్తే బందరు పోర్టుతో ఒడిశా, కోల్‌కతాకు కూడా అనుసంధానం ఏర్పడినట్టే. అలాగే, ఛత్తీస్‌గఢ్‌తో కూడా బందరు పోర్టుకు కనెక్టవిటీ ఏర్పడుతుంది. తిరువూరు ఎగువన ఎన్‌హెచ్-30కు ఎన్‌హెచ్ 216హెచ్ అనుసంధానం కావటం వల్ల ఛత్తీస్‌గఢ్‌కు కూడా మార్గం సుగమం అవుతుంది.

ఉమ్మడి కృష్ణాకు మహర్దశ

ఎన్‌హెచ్-216హెచ్‌ను విస్తరించటం ద్వారా బందరు పోర్టుకే కాకుండా ఉమ్మడి కృష్ణాజిల్లాకు మహర శ్ద కలుగుతుంది. ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. ప్రత్యామ్నాయ మార్గం వల్ల ఉమ్మడి జిల్లా ప్రజలు తక్కువ సమయంలోనే గమ్యస్థానం చేరేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. పెట్టుబడులను ఆకర్షించడానికి, పర్యాటకాభివృద్ధికి దోహదపడనుంది. ప్రధాన జాతీయ రహదారులపై రద్దీని కొంతవరకు తగ్గించగలగటంతో పాటు ప్రమాదాలను కూడా అరికట్టవచ్చు.

## విజయవాడ వెస్ట్ బైపాస్ పాక్షికంగా ప్రారంభం: ప్రయాణికులకు ఊరట

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు విజయవాడ వెస్ట్ బైపాస్ (పశ్చిమ బైపాస్) పనులను పాక్షికంగా ప్రారంభించనున్నారు. కాజా నుండి గొల్లపూడి మధ్య ఒక వైపు రోడ్డును పండుగ సమయంలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ఈ మార్గంలో కేవలం కార్లు, ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. గుంటూరు వైపు నుండి వచ్చే వాహనాలు నేరుగా గొల్లపూడి, చిన అవుటపల్లి మీదుగా ఏలూరు వైపు వెళ్లిపోవచ్చు. 2026 మార్చి చివరి నాటికి బైపాస్ పనులు పూర్తవుతాయి.



# సినిమా




## అందుకే భర్తతో విడిపోయా..

ఒకానొక సమయంలో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగి ఇప్పుడు క్యారెక్టరర్టిస్ట్ లుగా రాణిస్తున్నారు కొందరు హీరోయిన్స్. ఆ జాబితాలో సీనియర్ నటి ఆమని ఒకరు. అప్పట్లో ఆమనీకి విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ లో ఆమానికి అభిమానులు ఎక్కువ. స్టార్ హీరోల సినిమాల్లో నటించి మెప్పించారు. ఫ్యామిలీ ఎంటటైనర్ మూవీస్ లో ఆమని ఆకట్టుకున్నారు. ఇక ఇప్పుడు ఈ సీనియర్ హీరోయిన్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా సినిమాలు చేస్తున్నారు. అమ్మ, వదిన పాత్రల్లో నటిస్తూ అలరిస్తున్నారు ఆమని. ఓ వైపు సినిమాలతో పాటు సీరియల్స్ లోనూ నటిస్తున్నారు ఆమని.కాగా గతంలో ఆమని ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.ఓ ఇంటర్వ్యూలో తన వైవాహిక జీవితం, కెరీర్, పిల్లల పెంపకంపై అనేక వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడారు. పెళ్లి గురించి అడిగినప్పుడు, తమది లవ్ మ్యారేజ్ కాదని, అరేంజ్డ్ మ్యారేజ్ కూడా కాదని, కేవలం ఒక కనెక్ట్ అవ్వడం వల్ల జరిగిన బంధం అని తెలిపారు. ఆ సమయంలో ఆయన మంచితనం చూసి వివాహం జరిగిందని పేర్కొన్నారు. అయితే తన మాజీ భర్త ఆర్థిక ఇబ్బందుల కారణంగా తాను మళ్లీ సినిమాల్లోకి వచ్చి అప్పులు తీర్చారని మీడియాలో వచ్చిన వార్తలపై ఆమని స్పందించారు. ఆ వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమని అన్నారు. తన మాజీ భర్త సినిమా ప్రొడ్యూసర్గా ఉన్నప్పుడు తలెత్తిన కొన్ని సమస్యలు తనే పరిష్కరించుకున్నారని, అప్పులన్నింటినీ రియల్ ఎస్టేట్ ద్వారా తీర్చేశారని ఆమె తెలిపారు.

తనకు సినిమా అంటే ఉన్న ప్యాషన్ వల్లే మళ్లీ సినిమాల్లోకి వచ్చానని, బ్రేక్ తీసుకున్నది తానే అని స్పష్టం చేశారు. అప్పుడు తన భర్తకు కూడా తాను సినిమాల్లో ఉండటం ఇష్టం లేదని తెలిపారు. విడిపోవడం గురించి అడిగినప్పుడు, తమ బంధం ఎటువంటి పెద్ద సమస్యలు లేకుండా ఫ్రెండ్లీగా ముగిసిందని ఆమని పేర్కొన్నారు. తన మాజీ భర్త మంచి వ్యక్తి అని, తాను సినిమాల్లో బిజీగా ఉండగా, ఆయన తన వృత్తిపరమైన వ్యాపారంలో బిజీగా ఉన్నారని తెలిపారు. తాము ఇప్పటికీ మాట్లాడుకుంటున్నప్పటికీ, వేరుగా ఉంటున్నామని స్పష్టం చేశారు. అదేవిధంగా సింగిల్ పేరెంట్గా పిల్లల పెంపకంపై ఆమని తన అభిప్రాయాలను పంచుకున్నారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని..వారు తనకు ప్రపంచమే అని చెప్పారు. తన మొదటి ప్రపంచం సినిమా అయితే, రెండవ ప్రపంచం తన పిల్లలని వివరించారు. అదేవిధంగా హీరోయిన్గా స్థిరపడటానికి ఒక సంవత్సరం, ఒకటిన్నర సంవత్సరం కష్టపడ్డానని, పిల్లలు కూడా ఆలస్యంగానే వచ్చారని తెలిపారు.





## ముల్లంగి ఆకులలో దాగివున్న ఆరోగ్య రహస్యం తెలిస్తే.

శీతాకాలంలో రకరకాల కూరగాయాలు మార్కెట్కు వస్తుంటాయి. కూరగాయలు సంపూర్ణ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. అయితే, ఈ సీజన్లో వచ్చే ఒక కూరగాయ ముల్లంగి.. ఇది కూడా చాలా మందికి ఇష్టమైన వెజిటేబుల్. ముల్లంగితో పప్పు, సాంబార్, పచ్చడి, పరాటాలు ఇలా రకరకాల వంటకాలను తయారు చేస్తుంటారు. ముల్లంగి ఆకులు చాలా పోషకమైనవి. అందువల్ల, వాటిని పారవేసే బదులు వాటిని ఆహారంలో భాగం చేసుకుంటే, అది మీకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. శీతాకాలంలో ముల్లంగి ఆకులను తినడం వల్ల కలిగే అనేక ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం..

ముల్లంగి ఆకులలో ఉండే పోషకాలు.. ముల్లంగి ఆకులలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిలో విటమిన్ కె, విటమిన్ సి, ఐరన్, కాల్షియం, ఫోలేట్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు మన శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

విటమిన్ కె – ఈ విటమిన్ రక్తం గడ్డకట్టడంలో సహాయపడుతుంది. ఎముకలను బలపరుస్తుంది.విటమిన్ సి – ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఐరన్ – శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ను తీసుకువెళ్ళే హిమోగ్లోబిన్ తయారీకి ఇనుము సహాయపడుతుంది.

కాల్షియం – కాల్షియం ఎముకలు, దంతాలను బలపరుస్తుంది.

ఫోలేట్ – గర్భిణీ క్ష్మలకు ఫోలేట్ చాలా ముఖ్యం, ఎందుకంటే ఇది పిండం అభివృద్ధికి సహాయపడుతుంది.

శీతాకాలంలో ముల్లంగి ఆకులు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:

జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది– ముల్లంగి ఆకులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది – ముల్లంగి ఆకులు విటమిన్ సి సమృద్ధిగా ఉ ండటం వల్ల జలుబు మరియు దగ్గు వంటి వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి.

రక్తహీనత నివారణ– ముల్లంగి ఆకులు ఇనుముతో సమృద్ధిగా ఉండటం వల్ల రక్తహీనత రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి.

యూరిక్ యాసిడ్ తగ్గిస్తుంది – ముల్లంగి ఆకులు యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది ఆర్థరైటిస్ రోగులకు ప్రయోజనకరంగా ఉ ంటుంది.

గుండెకు మేలు చేస్తుంది – ముల్లంగి ఆకులు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి .

బరువు నియంత్రణ– ముల్లంగి ఆకులలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మీ కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. వేగంగా బరువు పెరగకుండా నిరోధిస్తుంది.

రక్తపోటు నియంత్రణ– ముల్లంగి ఆకులు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

చర్మానికి మేలు చేస్తుంది – ముల్లంగి ఆకులు విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉండటం వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుస్తాయి.



## వాల్నట్స్తో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో తెలుసా?

మన ఆరోగ్యానికి డ్రైఫ్రూట్స్ ఎంతో మేలు చేస్తాయి. ఇందులో ముఖ్యంగా వాల్నట్స్ కలిగించే ఆరోగ్య ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. వాల్నట్స్లో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్స్, ఫైబర్, ప్రోటీన్, అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అందుకే దీన్ని సూపర్ ఫుడ్గా పరిగణిస్తారు. వాల్నట్స్ మెదడు చురుగ్గా పనిచేసేందుకు సహకరిస్తుంది. గుండె పనితీరుకు మద్దతిస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే, ఎవరైనా వాల్నట్స్తో అలర్జీ కలిగి ఉన్నట్లయితే.. వారు మాత్రం వీటికి దూరంగా ఉండటం మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. వాల్నట్స్ వారికి ప్రమాదకరం కావచ్చంటున్నారు. వాల్నట్స్ తినడం వల్ల దురద, దద్దుర్లు, గొంతువాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన సందర్భాల్లో అనాఫిలాక్సిస్ ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

వాల్నట్స్ ఎవరికి ప్రమాదం?

వాల్నట్స్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కానీ, ఎక్కువగా తినడం వల్ల గ్యాస్, ఉ బ్బరం, కడుపు నొప్పి, విరేచనాలకు దారితీయవచ్చు. అంతేగాక, ప్రకోప ప్రేగు సింద్రోమ్ ఉన్నవారు లేదా ఇప్పటికే జీర్ణ సమస్యలు ఉన్నవారు వాల్నట్స్ చాలా పరిమితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## సంజూ శాంసన్ సెంచరీ..

కేరళ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మరోసారి తన బ్యాట్తో గర్జించాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025–26 సీజన్లో తాను ఆడిన మొదటి మ్యాచ్లోనే అద్భుతమైన సెంచరీతో కదం తొక్కాడు. న్యూజిలాండ్తో జరగబోయే వన్డే సిరీస్ కోసం టీమిండియాను ఎంపిక చేస్తున్న తరుణంలో, సంజూ చేసిన ఈ సెంచరీ ఇప్పుడు సెలక్టర్లకు పెద్ద సవాలుగా మారింది. జార్ఖండ్తో జరిగిన ఈ హై–స్కోరింగ్ మ్యాచ్లో సంజూ క్లాస్ ఇన్నింగ్స్ ఫ్యాన్స్కు కనువిందు చేసింది.

అహ్మదాబాద్ వేదికగా జార్ఖండ్తో జరిగిన ఐదో రౌండ్ పోరులో సంజూ శాంసన్ తన విశ్వరూపాన్ని చూపించాడు. జార్ఖండ్ నిర్దేశించిన 312 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేరళ ఓపెనర్ రోహన్ కున్నుమ్మల్ (124) తో కలిసి సంజూ ఇన్నింగ్స్ను పరిగెత్తించాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్కు ఏకంగా 212 పరుగుల రికార్డ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సంజూ కేవలం 90 బంతుల్లోనే తన సెంచరీ మార్కును అందుకున్నాడు. మొత్తం 95 బంతులు ఆడిన సంజూ, 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 101 పరుగులు చేసి టీమ్ ఇండియా సెలక్టర్లకు గట్టి సంకేతాలు పంపాడు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ జట్టులో కుమార్ కుశాగ్ర విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 137 బంతుల్లో 7 సిక్సర్లు, 8 ఫోర్లతో 143 పరుగులు చేసి నాటౌట్గా నిలిచాడు. జార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్లో నిరాశపరిచినప్పటికీ, కుశాగ్ర, అనుకూల్ రాయ్ (72) పుణ్యమా అని ఆ జట్టు 311 పరుగులు చేసింది. అయితే, ఇంత పెద్ద టార్గెట్ను కూడా సంజూ, రోహన్ జంట చాలా సులువుగా మార్చేశారు. రోహన్ కేవలం 78 బంతుల్లోనే 11 సిక్సర్లతో 124 పరుగులు చేయడం విశేషం.

సంజూ శాంసన్ ఇప్పటివరకు భారత్ తరపున 16 వన్డేలు ఆడి 510 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గమనించదగ్గ విషయం ఏంటంటే.. వన్డేల్లో సంజూ (స్ట్రైక్ రేట్ దాదాపు 100గా ఉంది. 2023 డిసెంబర్లో చివరిసారిగా వన్డే ఆడిన సంజూ, ఆ తర్వాత టీ20ల్లో మూడు సెంచరీలు బాది భీభత్సమైన ఫామ్లో ఉన్నాడు. ఇప్పుడు వన్డే ఫార్మాట్లో కూడా సెంచరీ సాధించడంతో, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్లతో పాటు మూడో వికెట్ కీపర్గా సంజూ పేరును సెలక్టర్లు పరిశీలించాల్సి ఉంటుంది.

జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం బీసీసీఐ త్వరలోనే జట్టును ప్రకటించనుంది. సాధారణంగా వన్డేల్లో పంత్, రాహుల్లకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది. కానీ, సంజూ ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే అతడిని పక్కన పెట్టడం సెలక్టర్లకు తలకు మించిన భారమే. పైగా టాప్ ఆర్డర్లో ఎవరైనా సీనియర్లు విశ్రాంతి తీసుకుంటే, సంజూను ఒక స్పెషలిస్ట్ బ్యాటర్గానైనా జట్టులోకి తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.



## ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ అవుట్..

ఐపీఎల్ 2026 సీజన్కు ముందు కోల్కతా నైట్ రైడర్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. భారీ ధర వెచ్చించి కొనుగోలు చేసిన బంగ్లాదేశ్ స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్ను జట్టు నుంచి తప్పించింది. బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ ఈ నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. అయితే, ముస్తాఫిజుర్ ఒక్కడేనా? లేక ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలో ఉన్న మరో బంగ్లా స్టార్ షకీబ్ అల్ హసన్ పై కూడా ఈ ప్రభావం పడనుందా? అన్న ఆందోళన అభిమానుల్లో మొదలైంది.

ఇటీవల దుబాయ్లో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో ముస్తాఫిజుర్ రహ్మాన్ను కేకేఆర్ ఏకంగా రూ.9.20 కోట్లకు దక్కించుకుంది. అయితే, బంగ్లాదేశ్లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అక్కడ మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో భారత్లో నిరసనలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా కోల్కతాలో బంగ్లా ప్లేయర్లను ఆడనివ్వకూడదని కొన్ని వర్గాల నుంచి ఒత్తిడి రావడంతో బీసీసీఐ రంగంలోకి దిగింది. ముస్తాఫిజుర్ను రిలీజ్ చేయాలని కేకేఆర్కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేకేఆర్ అధికారికంగా అతడిని జట్టు నుంచి తప్పిస్తున్నట్లు ప్రకటించింది. ముస్తాఫిజుర్ స్థానంలో మరో ఆటగాడిని ఎంచుకునేందుకు బీసీసీఐ అనుమతి ఇచ్చింది.

ఇక షకీబ్ అల్ హసన్ విషయానికి వస్తే..అతను ప్రస్తుతం యూఏఈ వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో ముంబై ఇండియన్స్ యాజమాన్యానికి చెందిన ఎమిరేట్స్ జట్టు తరపున ఆడుతున్నాడు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. ఐపీఎల్ నిర్వహించేది బీసీసీఐ, కానీ 20 నిర్వహించేది ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు. షకీబ్ ఆడుతున్నది దుబాయ్లో కాబట్టి, భారత్లో జరుగుతున్న నిరసనల ప్రభావం అక్కడ ఉండదు. జనవరి 4న జరగబోయే ఫైనల్ మ్యాచ్లో కూడా షకీబ్ ఆడే అవకాశం ఉంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com